జిల్లా ప్రజలకు భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు

● కలెక్టర్ జితేష్ వి.పాటిల్


కామారెడ్డి టౌన్, జనవరి 13: జిల్లా వ్యాప్తంగా ఆనందాల సంక్రాంతి రోజున ప్రజలు చేపట్టే కార్యక్రమాలన్నీ విజయవంతం కావాలని కోరుతూ పండుగను ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ కోరారు. గ్రామాలతో పాటు పట్టణాల్లో సైతం భోగి మంటలు, ముగ్గులు, గంగిరెద్దులు, హరిదాసు పాటలు, గాలిపటాల సందడితో పాటు ఇళ్లల్లో పిండి వంటలు తయారీతో సంక్రాంతి శోభను సంతరించుకుని మంచి వాతావరణంలో ప్రజలు గడపాలని కోరారు. ప్రజలందరికి భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు.



అవిశ్వాసాల ముసలం!

- జిల్లాలోని పీఏసీఎస్, మున్సిపాలిటీల్లో అవిశ్వాసానికి సిద్ధమవుతున్న ప్రతినిధులు
- కాంగ్రెస్‌లోకి క్యూ కడుతున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు
- చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు పావులు కదుపుతున్న కాంగ్రెస్
- పలు సొసైటీల చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాసం
- తాజాగా శెట్పల్లి సంగారెడ్డి సొసైటి, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాసం పెడుతూ డైరెక్టర్‌ల తీర్మానం
- జిల్లాలో మారుతున్న రాజకీయం

కామారెడ్డి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్థానిక సంస్థలు, సహకార సంఘాల పాలకవర్గాల్లో అవిశ్వాస ముసలం మొదలవుతోంది. ఎన్నికలకు ముందే జిల్లాలో ఓ మున్సిపాలిటీ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు పలువురు కౌన్సిలర్లు పావులు కదుపుతున్నారు. అదేవిధంగా పలు సొసైటీల్లోనూ చైర్మన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాసం పెడుతూ తీర్మానాలు చేస్తున్నారు. తాజాగా లింగంపేట మండలం శెట్పల్లి సంగారెడ్డి సొసైటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లపై డైరెక్టర్‌లు అవిశ్వాసం ప్రకటించారు. గత జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి ముందు జడ్పీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టాలని పలువురు జడ్పీటీసీలు రహస్య సమావేశమైన విషయం తెలిసిందే. ఇలాగే జిల్లాలోని పలువురు ఎంపీటీసీ, ఎంపీపీలపై అవిశ్వాసం పెట్టేందుకు పలువురు సభ్యులు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా పలువురు జడ్పీటీసీలు, కౌన్సిలర్‌లు కాంగ్రెస్ గూటికి చేరుతున్నారు. దీంతో ఆయా నేతలపై అవిశ్వాసం పెట్టేందుకు కాంగ్రెస్ పావులు కదుపుతోంది.



కాంగ్రెస్ గూటికి చేరుతున్న పలువురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు

జిల్లాలో కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ మూడు మున్సిపాలిటీలు ఉన్నాయి. ఈ మున్సిపాలిటీల్లో ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారే చైర్మన్‌లుగా ఉన్నారు. బాన్సువాడ, ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో అవిశ్వాస ప్రయత్నాలు జరగడం లేదు. కానీ కామారెడ్డి మున్సిపాలిటీలో మాత్రం చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు కాంగ్రెస్ పావులు కదుపుతోంది. మున్సిపాలిటీలో 49 వార్డులు ఉన్నాయి. 2019లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి 23 మంది కౌన్సిలర్‌లు గెలువగా కాంగ్రెస్ తరఫున 12 మంది, బీజేపీ నుంచి 8 మంది, 6 గురు స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందారు. తర్వాత చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ నుంచి 8 మంది కౌన్సిలర్‌లు బీఆర్ఎస్‌లో చేరగా స్వతంత్ర అభ్యర్థులు గెలిచిన 6 గురు కౌన్సిలర్‌లు, బీజేపీ నుంచి ఇద్దరు కౌన్సిలర్‌లు బీఆర్ఎస్‌లో చేరారు. దీంతో బీఆర్ఎస్ బలం 39 మందికి చేరింది. అయితే ఇటీవల కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పలువురు బీఆర్ఎస్ కౌన్సిలర్ లు కాంగ్రెస్‌లో చేరుతున్నారు. ఇప్పటి వరకు 9 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్‌లు కాంగ్రెస్ గూటికి చేరారు. దీంతో మున్సిపాలిటీలో కాంగ్రెస్ బలం 13కు చేరింది. ప్రస్తుతం బీఆర్ఎస్‌కు 30 మంది కౌన్సిలర్‌లు ఉన్నారు. వీరిలో మరో 12 మంది కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. మున్సిపాలిటీలో కాంగ్రెస్ బలం పెరుగగానే బీఆర్ఎస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు కాంగ్రెస్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

ఖర్చుతో కూడు కోవడంతో..

మున్సిపాలిటీలో అవిశ్వాస తీర్మానాన్ని నెగ్గించుకోవాలంటే మద్దతు పలికే కౌన్సిలర్‌లకు పెద్ద మొత్తంలో ముట్ట చెప్పాల్సి ఉంటుంది. వీటికి తోడు కౌన్సిలర్‌లను క్యాంపులకు తరలించడం తప్పనిసరి ఈ వ్యయప్రయాసలతో కూడుకున్నది. కామారెడ్డి లాంటి పెద్ద మున్సిపాలిటీలో అవిశ్వాసం నెగ్గాలంటే రూ.కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. మున్సిపాలిటీల పాలకవర్గం పదవికాలం మరో ఏడాది మాత్రమే ఉంది. కేవలం ఒక సంవత్సరం వీటి కోసం పెద్ద మొత్తంలో ఖర్చు చేసేందుకు నేతలు వెనుకంజ వేస్తున్నట్లు రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం వేసేందుకు ఏఏ కౌన్సిలర్‌లు ముందుకు వస్తారో చూడాలి.

సొసైటీల్లో అవిశ్వాసం రగడ

జిల్లాలోని పలు సహకార సంఘాల్లో అవిశ్వాసం రగడ మొదలైంది. విండో చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాసం ప్రకటించి ఆయా పదవులను కైవసం చేసుకోవాలని పలుచోట్ల మిగితా సభ్యులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే రాజంపేట సహకార సంఘంలో సొసైటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాసానికి డైరెక్టర్‌లు నోటీసులు ఇచ్చారు. ఆ సొసైటీలో అవిశ్వాసం ఓటింగ్ నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఇక్కడ అవిశ్వాసం గండం నుంచి బయట పడేందుకు ప్రస్తుతం ఉన్న చైర్మన్, వైస్ చైర్మన్‌లు తమ వైపునకు తిప్పుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. తాజాగా లింగంపేట మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి సొసైటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లపై పది మంది డైరెక్టర్‌లు అవిశ్వాసం ప్రకటించారు. జిల్లా ఇన్‌చార్జ్ డీసీవోకు అవిశ్వాస తీర్మాన కాపీలను అందజేశారు. సొసైటీలోని 13 మంది డైరెక్టర్ లకు గాను పది మంది అవిశ్వాసానికి అనుకూలంగా తీర్మానం చేశారు. ఇలా జిల్లాలోని పలు సొసైటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాసానికి డైరెక్టర్‌లు పావులు కదుపుతున్నారు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఆయా సహకార సంఘాల్లో కొందరు డైరెక్టర్‌లు అధికార పార్టీ అండతో అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇవ్వడానికి సన్నద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. మెజార్టీ సొసైటీ డైరెక్టర్‌లు బీఆర్ఎస్ పార్టీ చేతిలో ఉండగా కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలు అవిశ్వాసం పెట్టి పదవులను కైవసం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

మారుతున్న రాజకీయ పరిస్థితులు

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత జిల్లాలో రాజకీయ పరిస్థితులు పూర్తిగా మారుతున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కొలువుదీరిన విషయం తెలిసిందే. అయితే ఈ ఎన్నికల్లో కొందరు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పార్టీ మారుతున్నారు. కౌన్సిలర్‌లు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లోకి చేరుతున్నారు. ఇలా ఆయా మండలాలు, మున్సిపాలిటీల్లో రాజకీయాలు తారుమారు అవుతున్నాయి. ఈ నేపథ్యంలో అవిశ్వాస తీర్మానాలు తెరపైకి వస్తున్నాయి. కాగా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చి నెల రోజులకే అవిశ్వాసల ముసలం మొదలు కావడం జిల్లా రాజకీయాల్లో ఆసక్తికరంగా మారుతోంది.

గాలి పటాలు ఎగిరేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి



భిక్కనూరు, జనవరి 13: మనం జరుపుకునే అతిపెద్ద పండుగల్లో ఒకటి సంక్రాంతి పండుగ. సంక్రాంతి పండుగంటేనే చిన్న, పెద్ద, ఆడ, మగ తేడా లేకుండా అందరికీ ఇష్టమైన పండుగ. పండుగ మూడు, నాలుగు రోజుల ముందు నుంచే ప్రతీఇంట్లో పిండి వంటలు మొదలవుతాయి. సంక్రాంతి పండుగకు పిండి వంటలు, తీపి వంటలు, ముత్యాల ముగ్గులు ఎంత స్పెషల్‌లో... గాలి పటాలంటే అంతకుమించి స్పెషల్. పండుగ సెలువులు మెదలైనప్పటీ నుంచి మొదలు ఉదయం నుంచి సాయంత్రం వరకు చిన్నారులు, యువత గాలి పటాలను ఎగురవేస్తూ ఉంటారు. యువత ఒకరితో ఒకరు పోటీపడి మరి గాలిపటాలను ఎగురేస్తూంటారు. అందరితో కలిసి ఇలా గాలి పటాలను ఎగిరేయడం మంచి అనుభూతి. ఇదంతా బాగానే ఉన్నా గాలి పటాలను ఎగిరేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోకపోతే తగిన మూల్యం చెల్లించక తప్పదు. అందుకే ఈ గాలిపటాలను ఎగురవేసే సమయంలో జాగ్రత్తలు అవసరం. చిన్నారుల తల్లిదండ్రులు తప్పకుండా వారి పిల్లలను ఓ కంట కనిపెట్టాలి.

చైనా మాంజా ఉపయోగిస్తే చర్యలు తప్పవు

● సాయికుమార్, ఎస్సై, భిక్కనూరు

సంక్రాతి పండుగను ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలి. ముఖ్యంగా యువత, చిన్నారులు గాలి పటాలను ఎగిరేసే క్రమంలో జాగ్రత్తలు తీసుకోవాలి. చైనా మాంజాను ఎట్టి పరిస్థితుల్లో ఉపయోగించరాదు. ఒకవేళ చైనా మాంజా ఉపయోగించిన లేదా విక్రయించిన చర్యలు తప్పవు. విద్యుత్ తీగలకు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలి. తల్లిదండ్రులు వారి పిల్లలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. తెగిన గాలిపటాల కోసం పరుగెత్తి ప్రమాదాలకు గురికావద్దు.

గాలిపటాలు ఎగిరేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- గాలి పటాలను ఎగురవేయడానికి మంచి ప్రదేశాన్ని ఎంచుకోండి. బహిరంగ ప్రదేశాల్లో కాకుండా సురక్షితమైన ప్రదేశాల్లో ఎగరేయడం ఉత్తమం.
- ముఖ్యంగా ఇంటి పైకప్పులు, దాబాలపై గాలి పటాలను ఎగరేయడం చాలా ప్రమాదకరం. గాలి పటాలను ఎగరేసే సమయంలో మీ దృష్టంతా గాలి పటాలపై ఉండి, ఎక్కడున్నామన్నా విషయాన్ని మరిచి దాబాలపై, ఇంటి పైకప్పులపై పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కనుక దబాలపై, ఇంటి పైకప్పులపై గాలి పటాలను ఎగరేయకపోవడమే మంచిది.
- దారం నాణ్యమైనది ఎంచుకోవాలి. చైనా మాంజాను ఎట్టి పరిస్థితుల్లో వాడకూడదు. చైనా మాంజాతో పర్యావరణ హానితో పాటుగా, మీకు, వాహనదారులకు, పాదాచారులకు సైతం హానికరమే.
- గాలి పటాలను ఎగురవేసే క్రమంలో తప్పకుండా సన్ గ్లాసెస్, గ్లౌజులు ధరించాలి. సన్ గ్లాసెస్ పెట్టుకోవడంతో బలమైన సూర్య కిరణాలతో మీ కళ్లను, గ్లౌజులతో మీ చేతులను కాపాడుకోవచ్చు.
- తెగిన గాలిపటాల కోసం రోడ్లపై చిన్నారులు వెళ్లకుండా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలి. లేదంటే రోడ్డు ప్రమాదాల బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది.
- ముఖ్యంగా విద్యుత్ తీగలకు దూరంగా గాలి పటాలను ఎగురవేయాలి. గాలి పటాలు విద్యుత్ స్తంభాలకు, ట్రాన్స్‌ఫార్మర్లకు చుట్టుకుంటే వాటిని వదులుకోవడమే ఉత్తమం.



సదాశివనగర్‌లోని ఆదర్శ పాఠశాల

ఆదర్శ పాఠశాలల ప్రవేశాలకు వేళాయే

- దరఖాస్తుకు ఫిబ్రవరి 22వ తేదీ వరకు గడువు
- జిల్లాలో 6 ఆదర్శ పాఠశాలలు.. 600 సీట్లు
- ఆంగ్లమాధ్యమంలో బోధన

కామారెడ్డి టౌన్, జనవరి 13: గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్య తరగతి విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు ప్రభుత్వం మోడల్ స్కూల్ (తెలంగాణ ఆదర్శ పాఠశాల)ను ఏర్పాటు చేసింది. కార్పొరేట్ తరహాలో విద్యార్థులకు ఇంగ్లీషు మీడియంలో నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. 2024-25 విద్యా సంవత్సరానికిగాను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు సౌకర్యాలను కల్పించింది. ఈనెల 12న దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. 6వ తరగతితో పాటు 7,8,9,10వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నారు. జిల్లావ్యాప్తంగా 6 ఆదర్శ పాఠశాలలు ఉండగా ఆయా పాఠశాలల్లో 100 సీట్ల ప్రవేశానికి పరీక్ష నిర్వహించి ఎంపిక చేస్తారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి ఆయా సమీకరణాల ప్రకారం, రిజర్వేషన్లు అనుసరించి సీటును కేటాయించనున్నట్లు విద్యాశాఖాధికారులు పేర్కొంటున్నారు.

ఆరో తరగతిలో 600 సీట్లు

జిల్లాలోని 6 ఆదర్శ పాఠశాలల్లో ఆరో తరగతిలో 100 సీట్ల చొప్పున మొత్తం 600 సీట్లు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో ప్రవేశాలు పొందేందుకు విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ప్రస్తుతం ఆరో తరగతిలో 100 సీట్లను భర్తీ చేయడంతో పాటు మిగితా తరగతుల్లో ఖాళీ అయ్యే సీట్లను విద్యాశాఖ నిబంధనల మేరకు భర్తీ చేయనున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. ఈడబ్ల్యుఎస్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ విద్యార్థులు రూ.125, ఓసీ విద్యార్థులు రూ.200లు చెల్లించి ఫిబ్రవరి 22వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హులైన విద్యార్థులు వెబ్‌సైట్ తెలంగాణఎంఎస్.సీజీజీ.జీవోవీ.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఆరో తరగతి పేపర్‌లో 100 మార్కులకు ప్రశ్నలు ఉంటాయి. ప్రశ్నపత్రం తెలుగు, ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. తెలుగు, గణితం, ఎన్విరాన్‌మెంట్ సైన్స్, ఇంగ్లీష్‌లో 25 చొప్పున ప్రశ్నపత్రాలు ఉంటాయి. ఏడు నుంచి పదో తరగతులకు మ్యాథ్స్, సైన్స్, సోషల్, ఇంగ్లీషు నుంచి ప్రశ్నలు ఉంటాయి. ఏప్రిల్ 1న హాల్ టికెట్లు జారీ చేసి, 7న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 6వ తరగతి, అదేరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు 7వ తరగతి నుంచి 10వ తరగతి పరీక్షలు నిర్వహించనున్నారు.

వృత్తి విద్య కోర్సులు సైతం

విద్యార్థులకు వృత్తి విద్య కోర్సులను సైతం అమలు చేస్తున్నారు. వారిలో దాగి ఉన్న నైపుణ్యతను వెలికితీయడంతో పాటు ఉపాధి అవకాశాలు సైతం కల్పించేందుకు కృషి చేస్తున్నారు. రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ పథకం ద్వారా విద్యార్థులకు కోర్సును అందజేస్తున్నారు. విద్యార్థులకు ఆయా కోర్సులకు బట్టి సర్టిఫికేట్లను సైతం అందిస్తున్నారు. జిల్లాలోని బాన్సువాడ, మద్నూర్, నాగిరెడ్డిపేట, నిజాంసాగర్, సదాశివనగర్, ఎల్లారెడ్డి మండలాల్లో మొత్తం 6 పాఠశాలలు ఉన్నాయి. విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందుతోంది. ఆధునిక సైన్స్ ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఎంతగానో దోహదపడుతున్నాయి. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులను ముందుంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను పొందాలనే ఆశలను ప్రభుత్వం నెరవేర్చేందుకు అన్ని రకాల అవకాశాలు కల్పిస్తున్నందున విద్యార్థులు ఆదర్శ పాఠశాలల్లో సీటు పొందేందుకు కృషి చేస్తే తమ భవిష్యత్తును బంగారుమయంగా చేసుకోవచ్చని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలి

● రాజు, డీఈవో, కామారెడ్డి

ఈనెల 12 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. ఆరో తరగతికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. కార్పొరేట్‌కు దీటుగా ఆదర్శ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించడంతో పాటు ఆటలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తాం. ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తోంది.



లింగారెడ్డిపేట్‌లో రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్

రేషన్ దుకాణాల్లో స్టాక్ వివరాలను నమోదు చేయాలి

● జిల్లా అదనపు కలెక్టర్ చంద్రమోహన్

ఎల్లారెడ్డి, జనవరి 13 : ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని లింగారెడ్డిపేట్‌లో ఉన్న రేషన్ దుకాణాన్ని శనివారం సాయంత్రం అదనపు కలెక్టర్ చంద్రమోహన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్ దుకాణాల్లో తూనికలను పరిశీలించారు. బియ్యం స్టాకును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ రేషన్ దుకాణదారుడు విధిగా సమయపాలన పాటించాలన్నారు. దుకాణం నెంబర్‌తో సహా ఫ్లెక్సీ బోర్డు ఏర్పాటు చేసుకోవాలన్నారు. బోర్డుపై స్టాక్ వివరాలను తెలియజేసే విధంగా వివరాలు ఉండాలని ఆయన సూచించారు. తూకంలో అవకతవకలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ సురేష్, సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ ఖలీద్, రేషన్ డీలర్ పాపయ్య, నాగం సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



భిక్కనూరులో సామూహిక

హనుమాన్ చాలీసా పారాయణం

భిక్కనూరు, జనవరి 13: మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదారి సమీపంలో వెలిసిన బాలాంజనేయ స్వామి ఆలయంలో శనివారం భిక్కనూరు హనుమాన్ స్వాముల ఆధ్వర్యంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ఆలయ అర్చకులు, హనుమాన్ స్వాములు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి తీరొక్క పూలతో అందంగా అలంకరించారు. అనంతరం సిద్ధరామేశ్వర స్వామి ఆలయ పీఠాధిపతి సదాశివమహంత్, హనుమాన్ మాలాధారణ గురుస్వాములు నాగభూషణం, సిద్ధిరాములు ఆధ్వర్యంలో హనుమాన్, స్వాములు, భక్తులు పెద్దఎత్తున సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు హనుమాన్ స్వాముల భజన కార్యక్రమం ఆకట్టుకుంది. కాగా ఆలయ ప్రాంగణంలో హనుమాన్ స్వాములకు, భక్తులకు పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మట్కా కేసులో బీఆర్ఎస్ యువ నేతపై కేసు నమోదు

ఖిల్లా, జనవరి 13: జిల్లాలో సంచలనం సృష్టించిన మట్కా కేసులో బీఆర్ఎస్ పార్టీకి చెందిన యువ నేత ఇమ్రాన్ షహజాద్‌తో పాటు మరో 16 మందిపై నగరంలోని ఐదోటౌన్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు నార్త్ రూరల్ ఇన్స్‌పెక్టర్ సతీష్ తెలిపారు. బీఆర్ఎస్ పార్టీలో కీలంగా వ్యవహరించిన మైనారిటీ నేత మట్కా నిర్వాహణలో భాగస్వామ్యం ఉందనే పక్కా సమాచారంతో పోలీసుల విచారణలో తేలడంతో ఆయనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇమ్రాన్ షహజాద్‌తో పాటు మహారాష్ట్రకు చెందిన నీలేష్, నగరానికి చెందిన ఇర్ఫాన్, ఫైమద్, జాన్కంపేట్‌కు చెందిన గులామ్, వర్నికి చెందిన మీనాజ్, అభిజీత్, నాందేడ్‌కు చెందిన చందు, ఉమర్‌ఖేడ్‌కు చెందిన సంజీవ్, బీడ్‌కు చెందిన వసీం, ఉమ్రికి చెందిన మహబూబ్, బిలోలికి చెందిన సాజిద్, అకోలకు చెందిన అన్సార్, అమరావతికి చెందిన పటేల్, నౌషాద్, గుడ్డు, ముబీన్‌లు ఉన్నట్లు సీఐ తెలిపారు. ప్రస్తుతం వీరు పరారీలో ఉన్నారని వీరి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

డివైడర్లు ఏర్పాటు చేయాలని ఆందోళన

ఖిల్లా, జనవరి 13 : నగర శివారులోని నెహ్రూనగర్ సమీపంలో రోడ్డుకు మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు ఆందోళనకు దిగారు. శుక్రవారం రాత్రి నెహ్రూనగర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటనపై స్థానికులు ఆందోళనకు దిగారు. కొద్ది సేపు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా డివైడర్లు లేనందున తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. వెంటనే పోలీసుశాఖ స్పందించి డివైడర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న ట్రాఫిక్ సీఐ నారాయణ, సౌత్ రూరల్ ఇన్స్‌పెక్టర్ వెంకటనారాయణ, 6వ టౌన్ ఎస్సై మొగులయ్య సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని ఆందోళన కారులను శాంతింపజేశారు. సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

అక్రమంగా తరలిస్తున్న టిప్పర్లు సీజ్

మోపాల్, జనవరి 13: మోపాల్ మండలంలోని ఒడ్డెర కాలనీ ప్రాంతం నుండి అక్రమంగా మొరాన్ని నిజామాబాద్‌కు తరలిస్తున్న టిప్పర్లను శనివారం రాత్రి టాస్క్‌ఫోర్స్ అధికారులు దాటి చేసి ముగ్గురిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గత కొన్ని రోజుల నుంచి మొరాన్ని గుట్టుచప్పుడు కాకుండా కొందరు తరలిస్తున్నట్లు పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రాజశేఖర్‌రాజు, సీఐలు అంజయ్య, అజయ్‌బాబు, సిబ్బంది ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఎలాంటి వేబిల్లులు లేకుండా మొరాన్ని తరలిస్తున్నారన్నారు. ఒక ఖాళీ టిప్పరు, రెండు మొరం టిప్పర్లను సీజ్ చేసి ముగ్గురిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

జెడ్పీటీసీ నిధులతో బోరుబావి తవ్వకం

ఇందల్వాయి, జనవరి 13: ఇందల్వాయి మండలంలోని గన్నారం గ్రామంలో మహిళా భవనం వద్ద జెడ్పీటీసీ సుమనరెడ్డి నిధులతో బోరుబావి తవ్వించడం జరిగిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చిలివేరి దాస్ తెలిపారు. మహిళా భవనం వద్ద నీటి సౌకర్యం లేకపోవడంతో జెడ్పీటీసీ దృష్టికి తీసుకెళ్లామని ఆమె 15వ ఫైనాన్స్ నిధులు కేటాయించడంతో శనివారం బోరు వేయించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ లావణ్య రవి, జాగృతి అధ్యక్షుడు గంగాధర్, కుంట గంగారెడ్డి, రాంరెడ్డి, రాజేష్, వెంకట్ తదితరులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్

పరిశీలికురాలుగా ఫిజికల్ డైరెక్టర్ నీరజారెడ్డి

డిచ్‌పల్లి, జనవరి 13: ఈ నెల 12నుంచి 14వరకు సిద్దిపేట జిల్లా సాంఘిక సంక్షేమ పాఠశాల కొండపాక క్రీడ మైదానంలో జరుగుతున్న 67వ స్కూల్ గేమ్స్ రాష్ట్ర అండర్-19 సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ జరగనున్నాయి. రాష్ట్ర పరిశీలకురాలుగా ధర్మారం(బి) సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ఫిజికల్ డైరెక్టర్ నీరాజరెడ్డి వ్యవహరిస్తున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి గంగాధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తనకు ఈ అవకాశం వచ్చినందుకు నీరజారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.

సెట్విన్ ఆధ్వర్యంలో కంప్యూటర్ శిక్షణకు ఆహ్వానం

డిచ్‌పల్లి, జనవరి 13: నిరుద్యోగ యువతీయువకులకు తెలంగాణ యువజన శాఖ సెట్విన్ ఆధ్వర్యంలో కంప్యూటర్, మరియు టైలరింగ్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి అబ్రార్‌ఖాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ కావల్సిన వారు ఘన్‌పూర్ గ్రామ పంచాయతీ మొదటి అంతస్థులోని కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఆర్మూర్‌లో బసవన్న విన్యాసాలు

ఆర్మూర్‌టౌన్ , జనవరి13: ఆర్మూర్ పట్టణంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి వేడుకలలో భాగంగా వాడవాడలలో ప్రతీ ఇంటి ముందు మహిళలు ముగ్గులు వేయగా బసవన్న ప్రత్యేక ఆకర్షణ ఉంటు విన్యాసాలు చేయడంతో పలువురిని ఆకట్టుకున్నాయి. దీంతో బసవన్నకు సాంప్రదాయంగా బియ్యం, పండ్లు అందజేసి పలువురు మహిళలు ఆశీర్వచనాలు తీసుకున్నారు.

భార్య ఆత్మహత్య..? భర్త హత్య..?

» అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

» ఆమె బంధువుల దాడి.. చనిపోయిన భర్త

» అచ్చంపేటలో దారుణం.. ఇరు కుటుంబాల్లో విషాదం


సింధు, నాగార్జున (ఫైల్)

అచ్చంపేట, జనవరి 13 : అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత చనిపోయింది. కుటుంబ కలహాలు, వరకట్నం, లైంగిక వేధింపుల ఆరోపణలు ఆమె మరణం చుట్టూ అలుముకున్నాయి. కట్టుకున్నోడి వల్లనే తమ బిడ్డ చనిపోయిందని ఆగ్రహించిన యువతి బంధువులు ఆమె భర్తపై దాడి చేశారు. దెబ్బల తీవ్రతనో.. మరే కారణమో తెలియదు కానీ.. అతడు చనిపోయాడు. దీంతో ఇరు కుటుంబాల్లో విషాదం నిండింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు చెందిన సింధు(26)కు పట్టణంలోని శ్రీరాం(సరిరాం) ఆస్పత్రిలో పని చేస్తున్న ఖమ్మం జిల్లాకు చెందిన నాగార్జునతో పరిచయం ఏర్పడి, ప్రేమగా మారింది. మూడేళ్ల క్రితం వీరు హైదరాబాద్‌లోని ఆర్య సమాజ్‌లో పెళ్లి చేసుకున్నారు. కొంత కాలం అక్కడే ఉండి తర్వాత అచ్చంపేటకు వచ్చి శ్రీరాం ఆస్పత్రిలో పని చేస్తున్నారు. ఏడాది క్రితం దంపతుల మధ్య గొడవలు జరగడంతో సింధు.. బిజినేపల్లిలోని అమ్మమ్మ గారి ఇంటికి వెళ్లిపోయింది. నాగార్జున పోలీసులను ఆశ్రయించడంతో ఆమె తిరిగి వచ్చింది. ఆర్థిక పరిస్థితులు బాగాలేకపోవడం, డబ్బు కోసం భర్త వేధింపుల నేపథ్యంలో ఇరువురి మధ్య మళ్లీ గొడవలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి సింధు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. కొన ఊపిరితో ఉన్న ఆమెకు భర్త నాగార్జున.. శ్రీరాం ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలిస్తుండగా సింధు చనిపోయింది. ఈ విషయాన్ని నాగార్జున.. సింధు కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో ఆమె బంధువులు ఒక వాహనంలో అంబులెన్స్ వద్దకు చేరుకున్నారు. నాగార్జునను తమ వాహనంలో ఎక్కించుకొని తీవ్రంగా దాడి చేశారు. దెబ్బల తీవ్రతనో.. మరే కారణమో తెలియదు గానీ.. నాగార్జున చనిపోయాడు. అతడిని కొట్టి చంపేశారని నాగార్జున తల్లి, చెల్లెలు ఆరోపిస్తున్నారు. కాగా, తమ కూతురిని చంపి, ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని సింధు తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. నాగార్జున, డాక్టర్ కృష్ణ, అతడి భార్య హైమావతి ఇదంతా చేశారని చెప్పారు. డాక్టర్ కృష్ణ తమ కూతురిని పలుమార్లు లైంగికంగా వేధించాడని తెలిపారు. నాగార్జున మృతిపై అతడి కుటుంబీకులు కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నీటి బకెట్‌లో పడి చిన్నారి మృతి

కొత్తూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఓ 16 నెలల చిన్నారి ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు నీటి బకెట్‌లో పడి మృతిచెందింది. ఈ విషాదకర ఘటన రంగారెడ్డి జిల్లా కొత్తూర్‌లో శనివారం జరిగింది. బిహార్‌కు చెందిన ధర్మేందర్ దంపతులు కొత్తూర్ నారాయణగూడ కాలనీలో నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్న ధర్మేందర్ శనివారం పనికి వెళ్లాడు. అతని భార్య ఇంటి పనుల్లో నిమగ్నమై ఉండగా పెద్ద కుమార్తె రియా (16 నెలల) ఆడుకుంటూ వెళ్లి బాత్‌రూంలోని నీటి బకెట్‌లో పడిపోయింది. నీటి బకెట్‌లో చిన్నారి మృతి చెంది కనిపించడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

అప్పులు తీర్చలేక యువ రైతు ఆత్మహత్య

ఖానాపూర్, జనవరి 13 : పత్తి పంట దిగుబడి రాకపోవడం, అప్పులు పెరిగిపోవడంతో జీవితంపై విరక్తి చెందిన ఓ యువ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం చందునాయక్ తండాకు చెందిన గుగ్లావత్ శ్రీకాంత్ (26) రెండు ఎకరాల్లో పత్తి వేశాడు. ఈ సారి ఆశించినంత దిగుబడి రాలేదు. దీనికి తోడు తన అక్క పెళ్లి కోసం చేసిన రూ.3 లక్షల అప్పు ఎలా తీర్చాలో తెలియక నిత్యం మథన పడేవాడు. ఈ క్రమంలోనే శనివారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

బస్సు మంటల్లో మసైపోయి..

గద్వాల జిల్లా బీచుపల్లి వద్ద ప్రైవేటు బస్సు బోల్తా.. చెలరేగిన మంటలు.. మహిళ సజీవ దహనం


మంటల్లో పూర్తిగా కాలిపోయిన బస్సు, ఇన్‌సెట్లో.. మాలతి(ఫైల్)

గద్వాల, గద్వాల క్రైం /ఎర్రవల్లి, నార్సింగ్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): బోల్తాపడ్డ ఆ బస్సుకు అంటుకున్న మంటలు పెద్దవి కాకమునుపే ప్రయాణికుల్లో కొందరు ఎలాగో అలా బయటపడ్డారు. చాలామందిని స్థానికులే రక్షించారు. ఒక్క మహిళ మాత్రం ఆ బస్సులోనే ఉండిపోయింది. రాకాసి మంటలు కోరలు చాస్తూ బస్సు అంతటా వ్యాపించాయి. ఆ మంటల్లో ఆమె కాలిబూడిదై పోయింది. ఈ హృదయవిదారక ఘటన గద్వాల జిల్లాలో జరిగింది. హైదరాబాద్ నుంచి చిత్తూరు వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు శనివారం తెల్లవారుజామున బీచుపల్లి-ఎర్రవల్లి మధ్య బోల్తా పడింది. ఆ వెంటనే బస్సు ముందు భాగంలో మంటలంటున్నాయి. మృతురాలిని ఏపీలోని చిత్తూరు జిల్లాకు చెందిన మాలతి (45)గా గుర్తించారు. పోలీసుల వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి 11 గంటలకు ఓ ప్రైవేటు బస్సు హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి నుంచి చిత్తూరుకు బయలుదేరింది. బస్సులో 42 మంది ప్రయాణికులు, ఇద్దరు డ్రైవర్లు ఉన్నారు. హైదరాబాద్ నుంచి జడ్చర్ల దాబా దాకా ఒక డ్రైవర్ బస్సు నడిపాడు. తర్వాత ఒంటి గంట సమయంలో స్టీరింగ్ రెండో డ్రైవర్ తీసుకున్నాడు. బీచుపల్లి దాటిన తర్వాత, పదవ బెటాలియన్ సమీపంలో తెల్లవారుజామున 2.30 గంటలకు బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ప్రయాణికులు ప్రాణభయంతో కేకలు వేశారు. పక్కనే ఉన్న హార్వెస్టర్ గ్యారేజీ కార్మికులు, పెట్రోల్ బంక్ వర్కర్లు హుటాహుటిన స్పందించారు. బస్సు అద్దాలను పగులగొట్టి ప్రయాణికులను కాపాడారు. పోలీసులు కూడా సహాయక చర్యలు చేపట్టారు.ఆ వెంటనే బస్సులో మంటలు చెలరేగాయి. మంటల్లో మాలతి అనే ప్రయాణికురాలు చిక్కుకుపోయారు. ఆమె చెయ్యి బస్సు సీటు సందులో ఇరుక్కుపోవడంతో తప్పించుకునేందుకు వీల్లేకపోయినట్లు తెలుస్తోంది. కాపాడండి అంటూ ఆమె ఆర్తనాదాలు చేస్తున్నా, అప్పటికే మంటలు తీవ్రం కావడంతో ఎవరూ ఆమెను రక్షించే సాహసం చేయలేకపోయారు. అందరి కళ్ల ముందే ఆమె సజీవ దహనమయ్యారు. మాలతిది చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం, పుత్తమర్ల గ్రామం. ఆమె హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని రైస్ రీసెర్చ్ సెంటర్‌లో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నారు. భర్త శ్రీనివాస్ కూడా హైదరాబాద్‌లోనే వ్యాపారం చేస్తుండటంతో ఆ కుటుంబం నగరంలోని లంగర్‌హౌజ్‌లో ఉంటోంది. భర్త శ్రీనివాస్ తల్లి అనారోగ్యానికి గురవ్వడంతో రెండ్రోజుల క్రితం ఆమె చిత్తూరుకు వెళ్లిపోయారు. మాలతి కూడా శుక్రవారం రాత్రి బస్సులో సొంతూరుకు ప్రయాణమయ్యారు. తెల్లవారుజామున మూడు గంటల సమయంలో ఘటన జరగ్గా, ఉదయం ఏడు గంటల దాకా మాలతి మృతదేహం కాలుతూనే ఉంది.. తన కళ్ల ముందే మాలతి మంటల్లో సజీవదహనమైందని గద్వాల వాస్తవ్యుడు కలీం అనే ప్రత్యక్ష సాక్షి చెప్పారు. హైదరాబాద్ నుంచి ఊరికి వెళుతుండగా బస్సుకు మంటలంటుకోవడాన్ని గమనించి అక్కడికి వెళ్లాలని ఆయన చెప్పారు. కాగా డ్రైవర్ నిద్రమత్తే బస్సు ప్రమాదానికి కారణం అని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. 36 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఆరుగురు ప్రయాణికులు, ఒక డ్రైవర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఘటన స్థలంలోనే మాలతి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. గద్వాల, అలంపూర్ ఎమ్మెల్యేలు కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు ఘటనాస్థలికి వెళ్లారు.

గతంలోనూ ఇదే తరహా ఘటనలు

ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలో గతంలోనూ ఇలాంటి ప్రమాదాలు జరిగాయి. 2002 సెప్టెంబరు 5న గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం కోదండాపురం వద్ద హైదరాబాద్ నుంచి కడప జిల్లా రాయచోటికి వెళ్తున్న ఆర్టీసీ బస్సులో మంటలు చెలరేగాయి. ఈ బస్సులో ప్రయాణిస్తున్న 31 మందిలో 13 మంది చనిపోయారు. మరో 18 మందికి తీవ్రగాయాలయ్యాయి. 2013 అక్టోబరు 30న బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న జబ్బార్ ట్రావెల్స్‌కు చెందిన వాల్వో బస్సు కొత్తకోట మండలం పాలెం వద్ద కల్వర్టుకు ఢీకొని రాసుకపోవడంతో మంటలు చేలరేగి బస్సుకు మంటలంటుకున్నాయి.. ఈ ఘోర దుర్ఘటనలో 45 మంది సజీవదహనం అయ్యారు.

గుంతలోకి 3 వాహనాలు.. తల్లి, కొడుకు దుర్మరణం!

» ముందు వెళుతున్న ఆటోను ఢీకొట్టిన కారు

» అదుపుతప్పి ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొన్న ఆటో

» 3 వాహనాలూ గుంతలోకి.. కారులోని తల్లి, కుమారుడి మృతి

శంషాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఒక వాహనం అదుపు తప్పడం.. ఆ వాహనంతో పాటు మరో రెండు వాహనాలను ప్రమాదం బారిన పడేసింది! మూడు వాహనాలూ రోడ్డు పక్కన ఓ గుంతలో పడ్డాయి. ప్రమాదానికి గురైనవి కారు, ఆటో, బైక్! ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న తల్లి, కొడుకు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. ఆటోలో ప్రయాణిస్తున్న వారిలో ఒకరు, బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు గాయపడ్డారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ఘాంసిమియాగూడ వద్ద ఈ ప్రమాదం సంభవించింది. శంషాబాద్ రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. కాప్రా మునిసిపాలిటీ శ్రీరాంనగర్‌కు చెందిన బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ సైంటిఫిక్ ఆఫీసర్ మెరువ ఆదిశేషారెడ్డి(57), తల్లి రాములమ్మ(88)తో కలసి కారులో హైదరాబాద్ నుంచి నంద్యాలకు వెళుతున్నారు. ఘాంసిమియాగూడ వద్దకు రాగానే కారు అదుపుతప్పి ముందు వెళుతున్న ఆటోను ఢీకొట్టింది. ఫలితంగా ఆటో అదుపుతప్పి దాని ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొంది. ఫలితంగా మూడు వాహనాలు ఒకదాని వెంట మరొకటి హైదరాబాద్-బెంగుళూరు జాతీయ రహదారి విస్తరణ పనుల కోసం నిర్మించిన కల్వర్టులో బోల్తాపడ్డాయి. ప్రమాదంలో కారులో ఉన్న ఆదిశేషారెడ్డి, రాములమ్మ అక్కడికక్కడే మృతిచెందారు. బైక్‌పై ఉన్న గొల్ల ఆంజనేయులు, వెనుక కూర్చున్న పద్నాలుగేళ్ల బాలిక, ఆటోడ్రైవర్ రాయన్నగూడ సిద్ధయ్య గాయపడ్డారు. ఆటోలో ఉన్న మరో ఇద్దరు రోడ్డుపక్కనే పడిపోగా వారికి ఎలాంటి గాయాలు కాలేదు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని తల్లీకుమారుల మృతదేహాలను కల్వర్టు నీటిలో నుంచి బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

పండుగ సరుకుల కోసం వచ్చి..
పరలోకాలకు!

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

చేర్యాల, జనవరి 13: సంక్రాంతి పండుగకు సరుకులు కొనేందుకు బయటికి వచ్చిన మహిళ రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. కాటర్‌పిల్లర్ మెషీన్ ఆపరేటర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడంతోనే ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం దొమ్మాట గ్రామానికి చెందిన చల్లా లక్ష్మి(39) శనివారం చేర్యాలకు పండుగ కోసం సరుకులు కొనేందుకు వచ్చింది. తర్వాత ఇంటికి వెళ్లేందుకు చూస్తుండగా తమ ఇంటి సమీపంలోని బంధువు కనకారెడ్డి కలిసి టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై దొమ్మాటకు వెళ్తూ ఎక్కించుకున్నాడు. ఇటు జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పట్టణ శివారులో కల్వర్టు నిర్మాణం జరుగుతోంది. అక్కడ చెవులకు ఇయర్ ఫోన్స్ పెట్టుకొని కాటర్ పిల్లర్ మెషీన్‌తో ఆపరేటర్ నిర్లక్ష్యంగా కంకర మిశ్రమాన్ని చదును చేస్తూ వెనక వైపునకు తోలుతున్నాడు. ఇంతలో వెనక నుంచి వస్తున్న కనకారెడ్డి బండి అదుపు తప్పడంతో ఇద్దరూ కిందపడిపోయారు. అది గమనించని ఆపరేటర్ మెషీన్‌ను లక్ష్మి పైనుంచి తీయడంతో ఆమె మృతి చెందింది. కనకారెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. కాగా, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని మృతురాలి కుటుంబీకులు, బంధువులు చేర్యాల పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. జనగామ-సిద్దిపేట రహదారిపై బైఠాయించారు.

పతంగి ఎగురవేస్తుండగా
విద్యుత్తు షాక్

» అత్తాపూర్‌లో 11 ఏళ్ల బాలుడి దుర్మరణం

» రైలు పట్టాలపై పడిన గాలి పటం

» నవాంద్గీ స్టేషన్‌లో రైలు ఢీకొని బాలుడి మృతి

రాజేంద్రనగర్/బషీరాబాద్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): భవనంపై ఉన్న ఏసీ కాపర్ పైప్‌లైన్‌ను విద్యుత్ ప్రసారం జరిగి.. కరెంటు షాక్‌తో ఓ బాలుడు చనిపోయాడు. రాజేంద్రనగర్‌లో ఈ ఘోరం జరిగింది. అత్తాపూర్ రాంబాంగ్ మల్లయ్య టవర్స్ సమీపంలో మహారాష్ట్రకు చెందిన అభిషేక్ కుటుంబం ఉంటోంది. అభిషేక్ సోదరుడు మూడేళ్ల క్రితం చనిపోయాడు. అభిషేక్ వదిన చాలారోజుల క్రితం ఎటో వెళ్లిపోయింది. దీంతో వారి కుమారుడు తనిష్క్(11) పెదనాన్న అభిషేక్ వద్దే ఉంటున్నాడు. సంక్రాంతి సందర్భంగా అభిషేక్ కుమారుడు మోహిత్ పతంగి ఎగురవేసేందుకు మల్లయ్య టవర్స్ ముందు ఉన్న లక్ష్మీవాణి టవర్స్ పైకి వెళ్లాడు. అతడితో తనిష్క్ కూడా వెళ్లాడు. లక్ష్మీవాణి అపార్ట్‌మెంట్స్ పెంట్‌హౌస్‌పై ఇద్దరూ పతంగి ఎగురవేస్తుండగా అక్కడ ఏసీ ఔట్‌పుట్ కాపర్ పైప్‌లైన్‌కు తనిష్క్ తగిలాడు. దానికి అప్పటికే విద్యుత్తు ప్రసారం జరగడంతో షాక్‌తో చనిపోయాడు. గాలిపటం కోసం పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని బాలుడు చనిపోయాడు. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం నవాంద్గీ రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం ఈ ప్రమాదం జరిగింది. బషీరాబాద్ మైనారిటీ కాలనీకి చెందిన అస్లామ్ కుమారుడు అబుజార్(9) గాలిపటం ఎగరేస్తున్నాడు. అది తెగి ఇంటి సమీపంలోనే ఉన్న రైలు పట్టాలపై పడటంతో పతంగి తీసుకునేందుకు బాలుడు పరుగు తీశాడు. అప్పటికే స్టేషన్‌లో గూడ్స్ రైలు ఆగి ఉండటంతో దాని కింది నుంచి దూరి అటువైపు వెళ్తుండగా మరో ట్రాక్‌పై వస్తున్న రైలు ఢీకొట్టింది.

తెలంగాణాలో వచ్చే ప్రభుత్వం మాదే: ఎంపీ అర్వింద్


తిరుమలలో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

తిరుమల, జనవరి13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో తర్వాత ప్రభుత్వం బీజేపీదే అని ఆ పార్టీ ఎంపీ ధర్మపురి అరవింద్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో డబుల్ డిజిట్‌లో ఎంపీ స్థానాలు బీజేపీకి వస్తాయని అలాగే నరేంద్రమోదీ మళ్లీ ప్రధాని అవుతారన్నారు.500 ఏళ్ల తర్వాత శ్రీరాముల వారు తాను పుట్టిన స్థలానికి వస్తున్నారన్నారు. కులాలు, మతాలకు అతీతంగా శ్రీరామనామ స్మరణతో స్వాగతం పలుకుదామన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కోటగిరి,జనవరి13: దేశ ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో మనోహర్ రెడ్డి సూచించారు. పొతంగల్ మండల కేంద్రంలో శనివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ సాబ్ కా సాత్ సాబ్ కా వికాస్ నినాదంతో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. నవ భారత నిర్మాణంలో అమృత కాలం విశిష్టత, వికసిత్ భారత్ సంకల్పయాత్ర ఔన్నత్యంపై ప్రధాని సందేశాన్ని వినిపించి ప్రతిజ్ఞ చేశారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బీపీ, షుగర్స్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వర్ని శంకర్, ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, హెల్త్ సూపర్‌వైజర్లు సాయి కుమారి, ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ధర్పల్లిలో..

ధర్పల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎండీవో లక్ష్మణ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. యువకులు, మహిళలు రైతుల కోసం పథకాలు ఉన్నాయని వీటన్నింటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఎంపీవో రాజేష్, ఈవో సైపొద్దీన్, కర్కగంగారెడ్డి, శేఖర్, నజీర్, తదితరులు ఉన్నారు.

ఇందల్వాయిలో..

ఇందల్వాయి: కేంద్ర ప్రభుత్వ నిధులను వంద శాతం సద్వినియోగం చేసుకోవాలని మండల అధికారులు అన్నారు. శనివారం ఇందల్వాయి మండలంలోని చంద్రయాన్‌పల్లి గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. తెల్లరేషన్ కార్డు కలిగి ఉన్న వారు కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్‌పీజీ గ్యాస్, పీఎం కిసాన్, ఇండ్లులేని వారికి ఇండ్ల గురించి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం క్యాలెండర్లను ఆవిష్కరించారు.ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లలిత గంగాదాస్, ఉపసర్పంచ్ ప్రకాశ్, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ సంజీవ్‌రెడ్డి, వివిధశాఖల అధికారులు, లబ్ధిదారులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.


క్యాలెండర్‌లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అయోధ్య రాముని పూజిత అక్షింతల పంపిణీ


న్యాయాధికారికి అక్షింతలు అందజేస్తున్న దృశ్యం

నిజామాబాద్ అర్బన్, జనవరి 13: అయోధ్య శ్రీరామ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీరామ పూజిత అక్షింతలను విశ్వహిందూ పరిషత్, హిందూ వాహిని ప్రతినిధులు శనివారం పలువురు ప్రముఖులకు అందజేశారు. జిల్లా న్యాయాధికారి సునీత కుంచాల, అడిషనల్ కలెక్టర్ యాదిరెడ్డి, ఆర్మూర్ ఆర్‌డీవో వినోద్‌కుమార్, టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు అలుక కిషన్ తదితరులకు అక్షింతలను అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ విభాగ్ కార్యదర్శి కృష్ణ, అధ్యక్షుడు దినేష్ ఠాకూర్, గాజుల దయానంద్, హిందూ వాహిని అధ్యక్షుడు అనిల్, దాత్రిక రమేష్, తదితరులు పాల్గొన్నారు.

● అయోధ్య వరకు సైకిల్ యాత్ర ప్రారంభం...

అయోధ్య రాముడిని దర్శించుకునేందుకు 1200 కిలోమీటర్ల సైకిల్ యాత్రను శనివారం నగరంలోని ఖిల్లా రఘునాథ ఆలయం నుంచి ప్రారంభించారు. నగరానికి చెందిన నరేష్‌గౌడ్, రఘునాథ్ సిద్దుల అనే వ్యక్తులు సైకిల్ యాత్ర ద్వారా అయోధ్య వరకు వెళ్లనున్నారు. ఈ యాత్రను శనివారం విశ్వహిందూ పరిషత్ జిల్లా సహాయ కార్యదర్శి దాత్రిక రమేష్ జెండా ఊపి ప్రారంభించారు.

వర్ని: మండలంలోని తగిలేపల్లి గ్రామంలో అయోధ్య రాములోరి అక్షింతలను గడప గడపకు భజరంగ్‌దళ్ కార్యకర్తలు పంపిణీ చేశారు. ఇంటింటికి తిరుగుతూ రాములోరి అక్షింతలు, చిత్రపటాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో భజరంగ్ దళ్ కార్యకర్తలు ఉజ్వల్, శ్రీకాంత్, కృష్ణ, కిరణ్, నవీన్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అయోధ్య తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఎస్‌హెచ్‌వో సురేష్‌బాబుకు అయోధ్య రాముని అక్షింతలను అందజేశారు. అలాగేఎస్సై అంజమ్మకు అయోధ్యరాముని అక్షింతలను వీహెచ్‌పీ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి గాజుల దయానంద్, నగర అధ్యక్షుడు గరడి గంగాచరణ్, బోచకర్ నిఖిల్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

చింతలూర్, తొర్లికొండలో అయోధ్యరాముల అక్షింతల శోభయాత్ర

జక్రాన్‌పల్లి: మండలంలోని వివిధ గ్రామాలలో శనివారం అయోధ్య శ్రీరాముల అక్షింతలను శోభాయాత్రగా ప్రజలు, భక్తులు ఘనంగా జరుపుకున్నారు.మండలంలోని చింతలూర్, తొర్లికొండ, మునిపల్లి గ్రామాలలో అయోధ్య శ్రీరాముల అక్షింతలను ఊరేగింపు నిర్వహించారు. ఆలయంలో అక్షింతలకు ప్రజలు, భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అయోధ్య రాముని అక్షింతలను ప్రజలకు, భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీసభ్యులు, తొర్లికొండ, చింతలూర్, మునిపల్లి గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా గోదారంగనాథ స్వామి కల్యాణ వేడుకలు


గోదాదేవి కల్యాణ వేడుకలలో పాల్గొన్న భక్తులు


కమ్మర్‌పల్లిలో స్వామివారి పల్లకి సేవలో పాల్గొన్న భక్తులు

మోస్రా,జనవరి13: మండల కేంద్రంలోని రామాలయం, వేంకటేశ్వరాలయంలో శనివారం గోదారంగనాథ స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. 21జంటలతో కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పురోహితులు శ్రీనివాస్, విఠల్, నవీన్, భూపాల్ రెడ్డి, సుదర్శన్‌గౌడ్, నూలు శివ, విజయ్, వధువరులు మహేష్, రక్షిత, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్: బాల్కొండ మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో కొలువుదీరిన రంగనాథస్వామి దేవాలయంలో ఆదివారం కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతీ సంవత్సరం సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని వేదమంత్రోచ్చారణాల మధ్య రంగనాథస్వామి కల్యాణం జరుగుతోందని అన్నారు. అనంతరం అన్నదానం చేపట్టనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్నిఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మెండోర: మండల కేంద్రంలో కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదా రంగానాయకుల కల్యాణాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మ శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు మాట్లాడుతూ గోదాదేవి ప్రతీనిత్యం రంగనాథుని సేవిస్తూ రోజుకు ఒక మాసం చొప్పున చదివి భక్తిలో మునుగుతోంది. 30రోజులు విష్ణుపురం పూజించి రంగనాథ్‌ని వివాహం మకర సంక్రమము ముందుగా వివాహం చేసుకుంటోందని ఈ కల్యాణాన్ని లోకకల్యాణం భావిస్తారని అన్నారు. గోదారంగా కల్యాణం అనంతరం అన్నదానం నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీసభ్యులు, గ్రామప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్: ముప్కాల్ మండలం నల్లూర్ గ్రామంలో లడ్డు బాలాజీ మం దిరంలో ఆదివారం గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్నట్టుఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతీ సంవత్సరం సంక్రాంతి పండగను పురస్కరిం చుకొని ఆలయంలో గోదాదేవికల్యాణం జరుగుతుందని భక్తులు అశేషంగా తరలివచ్చి స్వామివారిని తిలకించాలని తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు ఆలయంలో భక్తుల కొరకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. అన్నదానం చేపట్టానున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కమ్మర్‌పల్లి: మండల కేంద్రం శివారులోని పాటిహనుమాన్ ఆలయం వద్ద కొలువుదీరిన రామాలయంలో శనివారం గోదాదేవి రఘనాథస్వామి కల్యాణం అంగరంగవైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ, సత్యనం దశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వామివారి కల్యాణ ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, శ్రీరాముల రక్మయ్య, వెల్పుల్ల దొంతుల రమణయ్య, బాలకిషన్ గ్రామప్రజలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కవిత నిజామాబాద్ నుంచి ఎంపీగా పోటీ చేయాలి : ప్రభాకర్‌రెడ్డి

సుభాష్‌నగర్, జనవరి 13: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేయాలని నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. నగరంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంపీగా ఉన్నప్పుడు కవిత పలు అభివృద్ధి కార్యక్రమాలు చేశారని మెడికల్ కళాశాల, కేంద్రీయ విశ్వవిద్యాలయం, సెజ్, రైల్వేలైన్ అభివృద్ధిలు చేశారన్నారు. తెలంగాణ సాంస్కృతి సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత కవితక్కదేనన్నారు. పార్లమెంట్ అభివృద్ధి కోసం 23.15 కోట్లు ఖర్చు చేసిన ఘనత కవితక్కకే సాధ్యమైందన్నారు. ప్రస్తుత ఎంపీ రూ.5 కోట్లు కూడా ఖర్చు పెట్టకపోవడం దురదృష్టకరమన్నారు. స్థానిక ప్రజల సమస్యల పట్ల అవగాహన ఉన్న ఉద్యమ నాయకురాలు కవిత మళ్లీ నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేయాల్సిందిగా నియోజకవర్గం అభివృద్ధిబాటలో తీసుకెళ్లాలని ప్రజల పక్షాన కోరుతున్నామన్నారు. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలను ప్రజల ముందు ఉంచి ఆరు గ్యారెంటీలు 420 హామీలను ఇచ్చి ప్రజలనుమోసం చేసి ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చిందన్నారు. ఆరుగ్యారెంటీలతో పాటు 420 హామీలను ప్రజలకు అందే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరపున పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, జిల్లా అధికార ప్రతినిధి సుజిత్‌సింగ్ ఠాకూర్, మాజీ కార్పొరేటర్ ఎనగందుల మురళి, నగర ప్రధాన కార్యదర్శి కరిపెరాజు, యువజన విభాగం అధ్యక్షుడు సత్యప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

తపస్వీ నిలయంలో అన్నదానం

ఆర్మూర్‌టౌన్, జనవరి13: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి తపస్వీ తేజో నిలయంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఫౌండర్ మెల్విన్ జోన్స్ జన్మదినం పురస్కరించుకొని ఆయన సేవలను గుర్తు చేస్తూ విద్యార్థులకు అన్నదానం చేశారు. 1917లో లయన్స్‌క్లబ్ స్థాపనకు అంకురార్పణ చేశారని, ఆయన స్థాపనతో ప్రారంభమైన లయన్స్‌క్లబ్ గత శతాబ్దాకాలంగా నిరుపేదలకు నీడనిచ్చే స్థాయికి నిస్వార్థ సేవల నందిస్తూ పలు సేవ కార్యక్రమాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని లయన్స్‌క్లబ్ సభ్యులు అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్య క్షుడు మోహన్‌దాస్, సభ్యులు రూపాలి నర్సయ్య, అంబల్ల తిరుపతి, చెన్న రవికుమార్, లోచర్ తదితరులు పాల్గొన్నారు

పోస్టర్ల ఆవిష్కరణ

సిరికొండ, జనవరి 13:ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయడానికి మూడు కమ్యూనిస్టు విప్లవ పార్టీల ఐక్యత కార్మిక కర్షక విద్యార్థి మేధావులకు స్ఫూర్తిదాయకంగా నిలవనుందని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథ ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి ఆర్.రమేష్ అన్నారు. శనివారం మండల ప్రజాపంథ కార్యాలయంలో మార్చి 3,4,5వ తేదీల్లో జరిగే జాతీయ స్థాయి మూడు విప్లవ పార్టీల ఐక్యత మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు అనీష్, డివిజన్ నాయకులు బాబన్న, దామోదర్, దుపూరి సాయిరెడ్డి, మండల నాయకులు రమేష్, కిశోర్, లింబన్న, గంగామల్లు, నరేష్, నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

తొర్లికొండలో వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు

జక్రాన్‌పల్లి, జనవరి13: మండలంలోని తొర్లికొండ గ్రామంలో శనివారం వేంకటేశ్వరస్వామి దేవాలయ ఉత్సవాలను భక్తులు, గ్రామ సులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారు జాము నుంచే భక్తులు కొండపైకి చేరుకున్నారు. అనంతరం స్వామివారి పల్లకీ ని భక్తులు కొండపై చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఆలయంలో భక్తులు, గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద భక్తుల కోసం అన్నదానం నిర్వహించారు. నూతనంగా నిర్మించినున్న వేంకటేశ్వరస్వామి నిర్మాణానికి భక్తులు, గ్రామస్థులు విరాళాలు అందజేశారు.ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీ సభ్యులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బైక్ దొంగలు రెచ్చిపోతున్నారు.. జాగ్రత్త!

- పట్టపగలు, రాత్రీ తేడా లేకుండా బైక్‌లు ఎత్తుకెళ్తున్న వైనం
- జాగ్రత్తలు అవసరమంటున్న పోలీసులు
- దొంగలను పట్టుకునే పనిలో ఖాకీలు బిజీబిజీ

భిక్కనూరు, జనవరి 13: గత కొన్ని రోజులుగా భిక్కనూరు సర్కిల్ పరిధిలో బైక్ దొంగలు రెచ్చిపోతున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా దొరికిన బైక్‌లను ఎత్తుకెళ్తు పోలీసులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. దొంగతనాలను ఎక్కువగా రాత్రి సమయంలో చేసే దొంగలు మధ్యాహ్న సమయంలో చుట్టూ మంది ఉన్నా, సీసీ కెమెరాలు ఉన్నాయన్న భయం లేకుండా చాకచాక్యంగా బైక్‌లను అపహరిస్తూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. సర్కిల్ పరిధిలో ఈ నెల కాలంలో పదుల సంఖ్యలో బైక్‌లు దొంగతానాలు కావడంతో సర్కిల్ పరిధిలోని ఆయా మండలాల ద్విచక్రవాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు.

భిక్కనూరు సర్కిల్ పరిధిలో నాలుగు బైక్‌ల అపహరణ

భిక్కనూరు సర్కిల్ పరిధిలోని భిక్కనూరు, బీబీపేట, దోమకొండ, రాజంపేట మండలాల్లో గత డిసెంబరు 2023 నుంచి ఇప్పటి వరకు నాలుగు బైక్‌లు అపహరణకుకు గురయ్యాయి. ఇందులో భిక్కనూరులో మూడు, బీబీపేటలో ఒకటి ఉన్నాయి. భిక్కనూరులో అపహరణకు గురైనా మూడు బైక్‌లలో ఒకటి రికవరీ కాగా మిగతా రెండుతో పాటుగా బీబీపేటలో అపహరణకు గురైనా బైక్ ఆచూకీ సైతం ఇప్పటి వరకు లభించలేదు. ఈ మూడు బైక్‌ల ఆచూకీని కనుక్కోవడంతో పాటుగా బైక్‌ల దొంగతనానికి పాల్పడుతున్న కేటుగాళ్లను పట్టుకునేందుకు భిక్కనూరు సర్కిల్ పోలీసులు నిమగ్నమయ్యారు.



భిక్కనూరులో వివరాలను సేకరిస్తున్న పోలీసులు

ఏటీఎం సెంటర్‌లో డబ్బులు డ్రా చేసుకుని వచ్చేసరికే ..

మండలంలోని అంతంపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పున్న గంగయ్య శుక్రవారం భిక్కనూరు మండల కేంద్రంలోని ఎస్‌బీఐ ఏటీఎం సెంటర్ ఎదుట తన ప్యాషన్ ప్రో బైక్ పెట్టి డబ్బులు డ్రా చేసుకుని వచ్చే సరికే కేవలం పది నిమిషాల వ్యవధిలో దొంగలు అతడి బైక్‌ను అపహరించుకుపోయారు. బ్యాంకు చుట్టూ హోటళ్లు, హీరో షోరూం, ఎలక్ట్రికల్ దుకాణంతో పాటుగా ఎప్పుడు జనంతో కిక్కిరిసినట్టు ఉండే ప్రదేశం, చుట్టూ సీసీ కెమెరాలు ఉన్న దొంగలు చాకచక్యంగా బైక్‌ను అపహరించుకుపోవడం పట్ల ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్న పరిస్థితి. కాగా ఇటీవల భిక్కనూరు పట్టణంలోని మెయిన్ చౌరస్తాలో రఘు అనే యువకుడు తన ఇంటి ఎదుట ఎప్పటిలాగే బుల్లెట్ బైక్‌కు లాక్ చేసి పార్క్ చేయగా బుల్లెట్‌ను అన్‌లాక్ చేసి దొంగలు అపహరించారు.

ఈ టిప్స్ వాడితే బైక్ దొంగతనాలకు చెక్ పెట్టవచ్చు

- బైక్ దొంగతనాలను నివారించడానికి ముఖ్యంగా బైక్ హ్యాండిల్ లాక్‌తో పాటుగా చైన్ లాక్ ఉపయోగించడం ఉత్తమం.
- మీ బైక్‌లో డిస్క్ బ్రేక్ ఉంటే దానికి డిస్క్ లాక్ మంచిది ఎంపిక చేసుకోవాలి.
- ముఖ్యంగా ఇటీవల పెరిగిన టెక్నాలజీతో యాంటీ తెఫ్ట్ అలారం ఉపయోగించవచ్చు. ఈ అలారం సెన్సార్‌లతో పని చేస్తుంది. ఈ బైక్‌ను ఎవరైనా హ్యాండిల్‌ను ఎవరైనా ఓపెన్ చేయడానికి ప్రయత్నిస్తే మిమ్మల్ని వెంటనే అలెర్ట్ చేస్తుంది.
- ముఖ్యంగా పార్క్ చేసే స్థలంలో సీసీ కెమెరాలు, వెలుతురు ఉండే విధంగా చూసుకోవాలి. వీటితో పాటుగా బైక్ మెకానిక్‌లతో సహాయంతో మరికొన్ని టిప్స్ వాడి ఈ బైక్ దొంగతనాలకు చెక్ పెట్టవచ్చు

బైక్ దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక నిఘా

- తిరుపయ్య, భిక్కనూరు సీఐ.

భిక్కనూరు సర్కిల్ పరిధిలో బైక్ దొంగతనాలను ఛేదించడానికి ప్రత్యేక నిఘా పెట్టాం. భిక్కనూరు సర్కిల్ పరిధిలో ఈ నెల రోజుల వ్యవధిలో నాలుగు బైక్‌లు చోరీకి గురయ్యాయి. ఇందులో ఒకటి రికవరి కాగా మూడు బైక్‌ల ఆచూకీ కోసం దర్యాప్తు వేగవంతం చేశాం. త్వరలోనే ఈ మూడు బైక్‌లో పాటు బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న దొంగలను పట్టుకుంటాం. వాహనదారులు సైతం జాగ్రత్తలు పాటించాలి. గ్రామాల్లో ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలి.

'ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి'



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌గౌడ్

కామారెడ్డిటౌన్, జనవరి 13: జిల్లా కేంద్రం చుట్టు వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయని, వాటిని గతంలోనే కొంతమంది గత ప్రభుత్వంలోని నాయకులు ఆక్రమించి సాగుచేస్తున్నారని, ఫామ్ హౌస్‌లు కట్టుకున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేలాది ఎకరాల భూములు ఉన్నాయని వాటిని ఆక్రమించడానికి కేసీఆర్ ఇక్కడ పోటీ చేస్తున్నాడని గతంలో ప్రతిపక్ష పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌లు విమర్శించాయని అన్నారు. ప్రస్తుతం ఆ విమర్శించిన పార్టీలే అధికారంలో ఉన్నాయని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా, కామారెడ్డి ఎమ్మెల్యే స్థానాన్ని బీజేపీ గెలుచుకుందని అన్నారు. కబ్జాకు గురైన ఆ భూములను స్వాధీనం చేసుకునేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలకు, ప్రభుత్వ వైద్య రంగానికి అలాంటి భూములను కేటాయించాలని ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో కబ్జా అయిన భూములు ఎక్కడెక్కడ ఉన్నాయో పరిశీలిస్తామని అలాంటి భూములు గుర్తించి ఎమ్మెల్యే, ప్రభుత్వ అధికారులకు తెలియజేస్తామని అవసరమైతే ప్రజాసంఘాల ఆధ్వర్యంలో భూ పోరటాలు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు మోతిరాం నాయక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య పూజిత అక్షింతల పంపిణీ



అక్షింతల వితరణ చేస్తున్న దృశ్యం

బీబీపేట, జనవరి13: మండల కేంద్రంలో అయోధ్య తీర క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో అయోధ్య రామమందిర అక్షింతలను ఆయా కుల సంఘాల అధ్యక్షులకు వితరణ చేశారు. కుల దేవాలయాల వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. కుల సంఘాల అధ్యక్షుడు ఆయా కులసభ్యులకు అందించాలని కోరారు. పవిత్రమైన అయోధ్య రాముని అక్షింతలను అందుకుని వాటిని పూజమందిరంలో భద్రపరుచుకుని ఇంట్లో జరిగే శుభకార్యాలకు ఉపయోగించుకోవాలని ట్రస్ట్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు చంద్రశేఖర్, ఆముదాల నరేందర్, శివ,రాజు, నర్సింలు పాల్గొన్నారు.

ఘనంగా గోదాదేవి కల్యాణ మహోత్సవం

తాడ్వాయి, జనవరి13: మండల కేంద్రంలో శ్రీశబరిమాత ఆశ్రమంలో శనివారం గోదాదేవి వేంకటేశ్వరస్వామి కళ్యాణమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు మంత్రోచ్ఛరణలు నిర్వహించి ప్రత్యేక కల్యాణ కార్యక్రమం చేశారు. భక్తులు కల్యాణ మహోత్సవంలో పాల్గొని పూజలు నిర్వహించా రు. కార్యక్రమంలో శ్రీ శబరిమాత భక్తులు గ్రామపెద్దలు పాల్గొన్నారు.



గోదాదేవి కళ్యాణంలో పాల్గొన్న భక్తులు

'ఎల్లారెడ్డికి రూ.10 కోట్లు మంజూరు చేయడం హర్షనీయం'



సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలభిషేకం చేస్తున్న నాయకులు

సదాశివనగర్, జనవరి 13: ఎల్లారెడ్డి నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు మొదటి అడుగుపడేందుకు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు కృషిచేశారని వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుల చిత్రపటాలకు పాలా భిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లారెడ్డి నియోజకవర్గ పరిస్థితులను ప్రభుత్వం వద్ద వివరించి ప్రత్యేక నిధుల కింద రూ.10కోట్లు మంజూరు చేయించడం హర్షనీయమని అన్నారు. ఈ నిధులతో ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ఉపయోగించనున్నట్లు ఎమ్మెల్యే తెలుపారని ఆయన అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు భాస్కర్‌రెడ్డి, సంగారెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు ఇర్షాద్, బాల రాజు తదితరులు పాల్గొన్నారు.

విధులకు కార్యదర్శి డుమ్మా!

- నెలలో రెండు మూడు రోజులే హాజరు
- ఇబ్బందుల్లో రైతులు

తాడ్వాయి, జనవరి 13: ప్రతిరోజూ విధులకు హాజరై రైతులకు ఏవైన సమస్యలు వస్తే పరిష్కారించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నెలలో రెండు నుంచి మూడు రోజులు మాత్రమే విధులకు హాజరవుతూ కాలం గడుపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దేమికలాన్ సింగిల్ విండో కార్యదర్శి భూపతిరెడ్డి విధులకు డుమ్మా కొడుతుండడంతో రైతులు, ప్రజలు తీవ్రఅవస్థలు పడుతున్నారు. విధులకు ఎప్పుడు వస్తున్నాడో ఎప్పుడు వెళ్తున్నాడో కూడా తెలియని పరిస్థితి నెలకొంటుందని రైతులు వాపోతున్నారు. ఎరువుల కోసం, విత్తనాల కోసం కార్యాలయానికి రైతులు వస్తే కార్యదర్శి అందుబాటులో ఉండడం లేదని పేర్కొంటున్నారు. గతంలో రైతుల రుణమాఫీ విషయంలోనూ కార్యదర్శి పూర్తిగా నిర్లక్ష్యంగా వ్య వహరించారనే ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక అధికారులు ఆడిందే ఆటగా సాగుతుందని మండిపడుతున్నారు.

మార్కెట్‌లో సంక్రాంతి సందడి

- సంక్రాంతి పండుగ ఏర్పాట్లలో రైతులు
- పండి వంటలతో బిజీబిజీగా మహిళలు
- వన భోజనాలకు ఏర్పాట్లు



ముగ్గుల కోసం రంగులు కొంటున్న యువతులు



కూరగాయల కొనుగోళ్లలో బిజీబిజీ



పాలు పొంగించే కుండల కొనుగోళ్లు

మద్నూర్, జనవరి13: మార్కెట్‌లో సంక్రాంతి పండుగ సందడి నెలకొంది. సంక్రాంతి పండుగ ఏర్పాట్లలో రైతులు, వారి కుటుంబీకులు బిజీబిజీగా ఉన్నారు. పండుగకు కావాల్సిన వస్తువుల కొనుగోళ్లతో మార్కెట్ సందడిగా కనిపించింది. శనివారం మద్నూర్ మార్కెట్‌లో రైతులు తమకు కావాల్సిన వస్తువులు కొనగోళ్లలో నిమగ్నమయ్యారు. సంక్రాంతి పండుగ ఖరీఫ్‌లో వేసిన అన్ని రకాల పంటలు చేతికి వచ్చాక రైతులు జరుపుకునే తొలి పండుగ. సంస్కృతి, సాంప్రదాయాలకు అద్దం పట్టే పండుగే సంక్రాంతి పండుగ. ఈ పండుగను రైతులు, కూలీలు వైభవంగా జరుపుకుంటారు. జుక్కల్ నియోజకవర్గంలో మహారాష్ట్ర, కర్ణాటక సాంప్రదాయాలతో తెలంగాణ సంస్కృతి ప్రకారం లక్ష్మీ పూజలు నిర్వహిస్తారు. రైతు కుటుంబ సభ్యులతో పాటు బంధు మిత్రులతో కలిసి జొన్న చేలకు వెళ్లి పూజలు నిర్వహించి, పిండి వంటలు ఆరగిస్తారు. సంక్రాంతి రోజు తెల్లవారు జాము నుంచే ప్రతి ఇంటి ముందర మహిళలు వేసిన రంగవల్లులతో కొత్త కళ కనిపిస్తుంది. యువకులు పతంగుల ఆటల్లో నిమగ్నమవుతారు. ఈ ప్రాంతంలో రైతులు తమ జొన్న చేలకు వెళ్లి జొన్న కర్రలకు చీర చుట్టి గుడిని ఏర్పాటు చేసి అందులో దీపం వెలిగిస్తారు. ఆ తర్వాత పిడకలపై మట్టితో తయారైన కుండలో పాలు పొంగించి లక్ష్మీ దేవికి పూజలు నిర్వహిస్తారు. జొన్న కర్రలతో తయారు చేసిన గుడిలో దీపం వెలిగించి, ఆ దీపాన్ని లక్ష్మీ దేవిగా పూజిస్తారు. పూజలు అయిన తర్వాత కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వన భోజనం చేస్తారు. ఈ భోజనంలో ప్రత్యేకంగా బెల్లం, పలుకులు, నువ్వులతో చేసిన స్వీట్లు, అన్ని రకాలకూరగాయలతో తయారు చేసిన బజ్జి కూరగా పిలువబడే కర్రితో భోజనాలు చేస్తారు. అందరి భోజనాలు పూర్తి చేసుకుని జొన్న చేలల్లో ఉంచిన దీపాన్ని ఇంటికి తీసుకెళ్లి దేవుని గదిలో ఉంచి పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం యువకులు, పిల్లలు పతంగులు ఎగురవేయడంలోని నిమగ్నం కాగా మహిళలు నోములను నోచు కుంటారు. చక్కెరతో తయారైన నోములను ఇంటింటికి వెళ్లి ఇచ్చి పుచ్చుకుంటారు. ఆ తర్వాత నువ్వులు, బెల్లం ఒకరికి ఒకరు ఇచ్చుకుని పండుగ శుభాకాంక్షలు చెప్పుకుంటారు. పండుగకు కావాల్సిన కూరగాయలు కుండలు, రంగులు కొనడంతో రైతులు, మహిళలతో మార్కెట్‌లో సందడి నెలకొంది.

పట్టణ ఎస్‌హెచ్‌వోగా చంద్రశేఖర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

కామారెడ్డిటౌన్, జనవరి13: కామారెడ్డి పట్టణ ఎస్‌హెచ్‌వోగా శనివారం చంద్రశేఖర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. గతంలో జిల్లాలోని ఎస్పీ కార్యాలయంలో ఎస్‌బీ సీఐగా విధులు నిర్వర్తించి బదిలీపై కామారెడ్డి ఎస్‌హెచ్‌వోగా వచ్చారు. ఇక్కడ పనిచేసిన నరేష్ సీఐడీ విభాగానికి బదిలీఅయ్యారు. ఎస్‌హెచ్‌వో మాట్లాడుతూ పట్టణంలో శాంతిభద్రతలను కాపాడేందుకు కృషిచేస్తానని తెలిపారు.

హైమాస్ట్ లైట్ల ప్రారంభం

దోమకొండ, జనవరి 13: మండలంలోని అంబార్‌పేట గ్రామంలో మూడు ప్రధాన చౌరస్తాలలో ఐమాక్స్ లైట్స్‌ను శనివారం ఆవిష్కరించినట్లు ఎంపీటీసీ పిరంగి రాజేశ్వర్ తెలిపారు. గ్రామ ఎంట్రెన్స్, బెంజరం కాలనీ, అంబేడ్కర్ బస్టాండ్ ఎదురుగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సలీం, నాగభూషణం, శేఖర్, మైసాగౌడ్, ప్రశాంత్‌గౌడ్, ఈశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

గోదారంగనాథ స్వామి కల్యాణోత్సవం

కామారెడ్డిటౌన్, జనవరి13: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్ గల గోదారంగనాథ స్వామి ఆలయంలో శనివారం కల్యాణోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారికి పండితుడు గుండి రంగాచార్యులు ఆధ్వర్యంలో అభిషేకపూజ,తిరుప్పావై ప్రవచన పారాయణం, తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో భక్తులు, సంఘ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాల అందజేత

కామారెడ్డిటౌన్, జనవరి 13: ప్రభుత్వ పాఠశాలలో చదివి 10/10 జీపీఏ సాధించిన విద్యార్థులకు విశ్రాంత ఉద్యోగుల ఆధ్వర్యంలో కలెక్టర్ జితేష్ వి.పాటిల్ చేతుల మీదుగా రూ.5వేల చొప్పున ప్రోత్సాహకం, ప్రశంస పత్రం అందించారు. కలెక్టర్ విద్యార్థుల పుస్తకాలు, పెన్నులు అందించారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్	- హనుమాన్
శాంతి	- గుంటూరు కారం
ప్రియా 70	- గుంటూరు కారం

బాన్సువాడ

మహేశ్వరి - గుంటూరు కారం

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210





బీర్కూర్‌లో సప్తహాలో కీర్తనలు పాడుతున్న వార్కరీలు

ముగిసిన అఖండ హరినామ సప్తహా

బీర్కూర్, జనవరి 13: బీర్కూర్ మండల కేంద్రంలోని వేంకటేశ్వర ఆలయంలో గత వారం రోజులుగా కొనసాగుతున్న అఖండ హరినామ సప్తహా శనివారంతో ముగిసింది. వారం రోజుల పాటు వార్కారీలు భక్తి శ్రద్ధలతో భజనలు, కీర్తనలు పాడగా భక్తులు భక్తి పారవశ్యంలో మునిగితేలారు. ప్రవచనం, హరిపాట్, కాకడ హారతి కార్యక్రమాలు చేపట్టారు. సప్తహా ముగింపు సందర్భంగా ఆలయ సన్నిధిలో మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మాడ వీధుల్లో శ్రీవారికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

టీటీడీలో శ్రీవారికి పల్లకీ సేవ

బీర్కూర్, జనవరి 13 : మండలంలోని తిమ్మాపూర్ గ్రామ శివారులోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో గత నెల రోజులుగా కొనసాగుతున్న ధనుర్మాసోత్సవాలు శనివారం నాటితో ముగిసాయి. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారికి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఇదిలా ఉండగా శ్రీవారు, అమ్మవార్లు పల్లకిలో ఆసీనులై భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయంలోని మాడ వీధుల్లో స్వామి వారికి పల్లకి సేవ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



అధ్వానంగా ఉన్న రాఘవపల్లి రోడ్డు

రూ. 4.22 కోట్లతో బీటీ రోడ్ల మంజూరు

నాగిరెడ్డిపేట, జనవరి 13: మండలంలోని పలు గ్రామాల రోడ్లు అధ్వానంగా మారడంతో నాలుగు గ్రామాల రోడ్లకు మోక్షం లభించింది. మండలంలోని నాలుగు గ్రామాలకు బీటీ రోడ్లు మంజూరయ్యాయి. మండలంలోని నాలుగు గ్రామ పంచాయతీలకు 4.22కోట్ల రూపాయల వ్యయంతో బీటీ రోడ్లు మంజూరైనట్లు ఎల్లారెడ్డి రోడ్లు భవనల శాఖ ఏఈ శ్రీకాంత్ తెలిపారు. బెజ్జం చెరువు తండాకు 2 కోట్ల 24 లక్షలతో 2.8 కిలో మీటర్లు, మెల్లకుంట తండాకు ఒక కోటి 10 లక్షలతో 1.3కిలో మీటర్లు, రాఘవపల్లికి 40 లక్షల రూపాయలతో 650 మీటర్లు, మహదేవునిగడ్డ తండాకు రూ.48 లక్షలతో 600 మీటర్లు బీటీ రోడ్డు మంజూరైనట్లు ఆయన తెలిపారు. బీటీ రోడ్ల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయిస్తామన్నారు.



పాఠశాలను పరిశీలిస్తున్న జడ్పీటీసీ

పెచ్చులూడిన స్కూల్ భవనాన్ని పరిశీలించిన జడ్పీటీసీ

నాగిరెడ్డిపేట, జనవరి 13: మండలంలోని రామక్కపల్లి ప్రాథమిక పాఠశాల భవనాన్ని శనివారం జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ఇటీవల పై పెచ్చులూడి పడినట్లు ఆయన తెలిపారు. పాఠశాలపై కప్పు పెచ్చులూడి పడినప్పుడు విద్యార్థులు, చిన్నారులు ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని ఆయన అన్నారు. అధికారులు స్పందించి పాఠశాలకు నూతన భవన నిర్మాణాన్ని మంజూరు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రతాప్‌రెడ్డి, పర్వారెడ్డి, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.